క్లుప్తంగా

'ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలి'

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు రోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రులు నడుపుతున్నారని, రోగులకు అందించే సేవలకు ఫీజుల వివరాలు, డాక్టర్ల వివరాల నోటీస్ బోర్డులు ఏర్పాటు చేయడం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆస్పత్రులపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దేవి పోచన్న, చాడా మహేందర్ రెడ్డి, జిల్లా సమితి సభ్యులు మంండ యాదగిరి, బియ్యాల రాజేశం, గాజుల రవికుమార్, నర్సయ్య, సారయ్య పాల్గొన్నారు.

'బీసీ బంధు' అమలు చేయాలి

పాతమంచిర్యాల: బీసీలకు బీసీ బంధు పథకాన్ని ప్రవేశపెట్టి బీసీ బంధు పథకం ద్వారా బీసీ కుటుంబాలకు రూ.10లక్షలు ఇవ్వాలని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్మభూమినగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలలోని కులవృత్తుల వారికి ప్రభుత్వం ప్రకటించిన రూ.1లక్ష సాయం పథకం వల్ల, కులవృత్తుల వారు ఆర్థికంగా బలపడే అవకాశం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కో కన్వీనర్ సంగం లక్ష్మణ్, నాయకులు కొత్తకొండ రమేష్, ఊటూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: తెలంగాణలో దళితబంధు అమలు చేసినట్లు బీసీ బంధు అమలు చేయాలని కాంగ్రెస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి, అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జీవన్‌కుమార్, నాయకులు సంతోష్, రాములు, నంబయ్య, హనుమంతు, మధూకర్, రాజు, మైపాల్, పోశం, రవిత తదితరులు ఉన్నారు.

చర్యలు తీసుకోవాలి

చెన్నూర్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు పాఠ్య పుస్తకాలను విక్రయిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ చిప్పకుర్తి శ్రీనివాస్ అన్నారు. ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం మండల విద్యావనరుల కేంద్రంలో జూనియర్ అసిస్టెంట్ లావణ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌సీ జిల్లా నాయకులు నితీశ్, ఎస్ఎస్‌యూఐ నాయకులు అభిరామ్ పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీ కేసుల్లో జాప్యం జరగకుండా చూడాలి'

జన్నారం: ఎస్సీ, ఎస్టీ కేసులను జాప్యం చేయకుండా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్టీ, ఎస్సీ మానిటరింగ్, విజిలెన్స్ కమిటీ సభ్యులు జిల్లాపెల్లి వెంకటేశం, బచ్చల అంజన్న, రేగుంట లింగయ్య పేర్కొన్నారు. మండలంలో రాంపూర్, కలమడుగు గ్రామాలకు చెందిన బాధితులను గురువారం కలిసి మాట్లాడారు. అవమానాలకు గురైన వారు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు అయినా, శిక్ష పడటంలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ విషయంలో పోలీసులు బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని పేర్కొన్నారు.

ఆర్థికసాయం

తాండూర్: విద్యుత్ షాక్‌తో మరణించిన బాధిత కుటుంబానికి ఓ ఇంటి యాజమాని ఆర్థిక వితరణ చేసి మానవత్వాన్ని చాటుకున్నాడు. మండల కేంద్రానికి చెందిన కామని శ్రీనివాస్ అనే వ్యక్తి ఇంటి పని నిమిత్తం సిడాం రాజు అనే వ్యక్తిని కూలీ పనులకు పిలిచాడు. దురదృష్టవశాత్తు రాజు కరెంట్ షాక్‌తో గత నెల 31న మృతి చెందాడు. ఇందుకు కలత చెందిన శ్రీనివాస్ గురువారం మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి వెళ్లి మృతుడు రాజు భార్య జైతుబాయి, తండ్రి సిడాం రాముకు రూ.5లక్షల నగదును అందజేశారు. ఆర్థికంగా ఆదుకున్న శ్రీనివాస్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

'అండగా ఉంటాం'

వేమనపల్లి: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన మాజీ జెడ్పీటీసీ లచ్చయ్య కుటుంబానికి అండగా ఉంటామని మాజీ మంత్రి గడ్డం వినోద్ అన్నారు. మండలంలోని ముల్కలపేటకు వెళ్లి గురువారం పరామర్శించి రూ.50వేల నగదు అందజేశారు.

ఘనంగా శ్రీశ్రీ వర్ధంతి

మంచిర్యాలఅర్బన్: స్థానిక ట్రినిటీ హైస్కూల్‌లో శ్రీశ్రీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షురాలు మాట్లాడుతూ.. శ్రీ శ్రీ సాహిత్యాన్ని కొనియాడారు. శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం పుస్తకాన్ని ట్రినిటీ స్కూల్ గ్రంథాలయానికి అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పెద్ది భరత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జిల్లాలోని మున్సిపాలిటీల వివరాలు

మున్సిపాలిటీ	జనాభా	వార్డులు	చెత్త (మెట్రిక్‌టన్నులు)	ఖర్చు (లక్షలు)
మంచిర్యాల	1.50	36	45	82
బెల్లంపల్లి	56,396	34	23	4
నస్పూర్	85,000	25	22	13
మందమర్రి	70,000	24	35	18
క్యాతన్‌పల్లి	34,182	22	09	10
చెన్నూర్	23,579	18	02	16
లక్సెట్టిపేట	24,543	15	09	5

స్వచ్ఛత.. మచ్చుకైనా కానరాదే!

- మున్సిపాలిటీల్లో కానరాని స్పెషల్‌డ్రైవ్
- మొక్కుబడిగా ప్రత్యేక పారిశుధ్య పనులు
- అస్తవ్యస్తంగా డ్రైయినేజీ వ్యవస్థ
- పొంచి ఉన్న ముంపు ముప్పు

చెన్నూర్: ప్రభుత్వం పట్టణప్రగతి కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. జూన్ 5నుంచి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టగా, మున్సిపాలిటీల్లో కానరావడం లేదు. అధికారులు ప్రత్యేక పారిశుధ్య పనులను ప్రధాన వీధుల్లో నామమాత్రంగా చేపట్టి చేతులు దులుపేసుకుంటున్నారని మున్సిపాలిటీల్లోని ప్రజలు ఆరోపిస్తున్నారు. రానున్నది వర్షాకాలం.. పారిశుధ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది.

- మంచిర్యాల మున్సిపాలిటీలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా డ్రైయినేజీల్లో పూడికతీత పనులు చేపట్టారు.
- బెల్లంపల్లి మున్సిపాలిటీలో స్పెషల్ డ్రైవ్ నామమాత్రంగా సాగుతుంది. నేటికీ డ్రైయినేజీల పూడికతీత పనులు ప్రారంభం కాలేదు. దీంతో చెత్తాచెదారం పేరుకుపోయింది.
- మందమర్రి మున్సిపాలిటీలోని దీపక్‌నగర్, శ్రీపతినగర్, విద్యానగర్‌లలో డ్రైయినేజీలు, కల్వర్టులు లేకపోవడంతో మురుగునీరు రోడ్డు పైనే ప్రవహిస్తోంది. వర్షాకాలంలో ఈ సమస్య తీవ్రంగా ఉంటుంది. ప్రభుత్వం స్పెషల్‌డ్రైవ్ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినప్పటికి, నేటికీ ప్రత్యేక పారిశుధ్య పనులు ప్రారంభం కాలేదు.
- చెన్నూర్ మున్సిపాలిటీలో ప్రత్యేక పారిశుధ్య పనులు నామమాత్రంగా చేపట్టారు. మున్సిపాలిటీలో మెజార్టీ వార్డుల్లో డ్రైయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక వర్షాకాలంలో వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతున్నాయి. ముఖ్యంగా మేరవాడ, లైన్‌గడ్డ కాలనీల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కొన్ని వీధుల్లో అధికారులు డ్రైయినేజీలు శుభ్రం చేయించారు. బ్రాహ్మణవాడ, పెండ్లి పోచమ్మ వీధి, మేరవాడల్లో డ్రైయినేజీలు శుభ్రం చేయలేదు. డ్రైయినేజీల్లో చెత్త కుళ్లిపోయి కంపుకొడుతున్నాయి. దోమలు స్వైర విహారం చేస్తున్నాయి.
- క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలోని గంగా కాలనీలో డ్రైయినేజీలు అస్తవ్యస్తంగా మారాయి. డ్రైయినేజీలు నిర్మించాల్సిన అవసరం ఉంది. మున్సిపాలిటీలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడుతున్నారు.
- లక్సెట్టిపేట మున్సిపాలిటీలోని ముల్కలగూడ, మస్తాన్‌గూడ కాలనీల్లో మురికి కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టలేదు.
- నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫ్లడ్ కాలనీ, విలేజ్‌శ్రీరాంపూర్, ఠాగూర్‌నగర్, ఎస్ఆర్‌నగర్ కాలనీల్లో డ్రైయినేజీలు సక్రమంగా లేవు. వర్షాకాలం నీరు రోడ్ల వెంట పారడంతో కాలనీలు బురదమయంగా మారుతున్నాయి.

పేరుకుపోయిన చెత్త కుప్పలు

జిల్లాలో మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, క్యాతన్‌పల్లి, నస్పూర్, లక్షెట్టిపేట, చెన్నూర్ మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందులో మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి పాత మున్సిపాలిటీలు కాగా చెన్నూర్, లక్షెట్టిపేట, నస్పూర్, క్యాతన్‌పల్లి నూతనంగా ఏర్పడగా కనీసం పురపాలికల్లో చెత్త డబ్బాలు కూడా ఏర్పాటు చేయాలేదు. దీంతో చెత్తను ఖాళీ స్థలాల్లో పారబోయాల్సి వస్తుంది. పాత మున్సిపాలిటీల్లో చెత్త సేకరణ సక్రమంగా ఉన్నప్పటికీ, కొత్త మున్సిపాలిటీల్లో చెత్త సేకరణ రెండు రోజులు, మూడు రోజులకు ఒక్కసారి నిర్వహిస్తున్నారు. దీంతో కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. జిల్లాలో కొన్ని మున్సిపాలిటీల్లో డ్రైయినేజీ వ్యవ స్థ సక్రమంగా లేకపోవడంతో, వర్షపు నీరు రోడ్ల పైకి చేరి రోడ్లన్నీ బురదగా మారుతున్నాయి. రోడ్డు పక్కన వేసిన వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లి దోమలు వృద్ధి చెందుతున్నాయి.



చెన్నూర్ పెండ్లిపోచమ్మ వీధిలో రోడ్డు పక్కన

స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుంది

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం కొనసాగుతోంది. మూడు రోజులు ఒక్క వార్డు చొప్పున పారిశుధ్య పనులు చేయిస్తున్నాం. డ్రైయినేజీల నిర్మాణాలతో పాటు ఇంటర్నల్ రోడ్లు నిర్మాణాలకు రూ.28కోట్ల నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే డ్రైయినేజీలు నిర్మిస్తాం. పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకుంటా.

- గంగాధర్, మున్సిపల్ కమిషనర్, చెన్నూర్

సమాచారం

తాండూర్ సీఐగా శ్రీనివాసరావు



తాండూర్: మండలంలోని పోలీస్‌స్టేషన్ సీఐగా కూచన శ్రీనివాసరావు గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ సీఐగా పని చేసిన కె.జగదీష్ పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో రామగుండం సీసీఎస్‌లో ఉన్న శ్రీనివాసరావును తాండూర్ సీఐగా బదిలీ చేశారు. కాగా జగదీష్ స్థానంలో మంగళవారం వెలువడిన ఉత్తర్వుల్లో సీఐడీ విభాగంలో పనిచేస్తున్న సతీష్‌ను బదిలీ చేశారు. ఒక్కరోజు వ్యవధిలో సీఐని తారుమారు చేసి శ్రీనివాసరావును నియమించారు. సతీష్‌కు నిజామాబాద్ పోస్టింగ్ ఇచ్చి, శ్రీనివాసరావును తాండూర్‌కు బదిలీ చేయడం గమనార్హం.

నేడు పూజ సామగ్రి విక్రయానికి వేలం

చెన్నూర్: పట్టణంలోని మధునపోచమ్మ ఆలయం వద్ద కిరాణా పూజ సామగ్రి, శీతలపానీయలు, ఆట వస్తువులు విక్రయించుకోవడానికి శుక్రవారం ఉదయం 11గంటలకు ఆలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రవి తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు వేలంలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

రేపు చెన్నూర్‌కు పురుషోత్తమ భారతిస్వామి రాక

చెన్నూర్: పట్టణంలోని (అంబా ఆగస్త్యేశ్వరాలయం) శివాలయానికి ఈ నెల 17న శనివారం సాయంత్రం 5గంటలకు శ్రీ శృంగేరి శివగంగ జగద్గురు శ్రీ పురుషోత్తమ భారతి స్వామి రానున్నట్లు ఆలయ అర్చకులు మహేశ్వర్‌శర్మ తెలిపారు. స్వామివారికి గాంధీచౌక్ నుంచి పూర్ణకుంభం, మహిళలు మంగళహారతులు, కోలాటల మధ్య స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు స్వామి వారి దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఆలయంలో చంద్రమౌళీశ్వర పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పూజల్లో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పథకాలతో పల్లెలన్నీ ప్రగతి వైపు

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

దండేపల్లి: సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న పథకాలతో పల్లెలన్నీ ప్రగతి వైపు పరుగులు తీస్తున్నాయని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం దండేపల్లి, గుడిరేవు గ్రామాల్లో నిర్వహించిన పల్లెప్రగతి వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. పల్లెప్రగతి కార్యక్రమంతో ప్రతిపల్లెలో ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాలు, డంపింగ్‌యార్డులు, గ్రామాల్లో చెత్తను తీసుకెళ్లేందుకు జీపీకో ట్రాక్టర్‌ను కొనుగోలు చేశారని గుర్తు చేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. దండేపల్లి, గుడిరేవు గ్రామాల్లో నూతనంగా నిర్మించే గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో రైతుసమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, సర్పంచ్‌లు చంద్రకళ, లింగవ్వ, వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీనివాస్, ఉపసర్పంచ్ భూమన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సత్యం, నాయకులు పాల్గొన్నారు.



దండేపల్లి: కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

అభివృద్ధి పనులకు భూమిపూజ

లక్సెట్టిపేట: మండలంలోని సూరారం, జెండావెంకటాపూర్, వెంకట్రావుపేట, కొత్తూరు గ్రామ పంచాయతీ భవనాలకు ప్రత్యేక నిధులు మంజూరు కాగా గురువారం ఎమ్మెల్యే దివాకర్‌రావు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని జెండావెంకటాపూర్‌లో పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే దివాకర్‌రావు శాలువాలు కప్పి సన్మానం చేశారు.

బొక్కలగుట్టలో 'కమ్యూనిటీ కాంటాక్ట్'

రామకృష్ణాపూర్: మందమర్రి మండలంలోని బొక్కలగుట్టలో గురువారం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల రక్షణ కోసం, నేరాల నిర్మూలన కోసం కమ్యూనిటీ కాంటాక్ట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరూ పాల్పడకూడదని, ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్య తలెత్తినా, వెంటనే 100నంబరుకు డయల్ చేయాలని సూచించారు. కొత్త వ్యక్తులు, అనుమానితులు గ్రామంలో కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు. సరైన పత్రాలు లేని పలు వాహనాలకు జరిమానాలు విధించారు. పట్టణ ఎస్సై అశోక్, కాసిపేట ఎస్సై గంగారాం, దేవాపూర్ ఎస్సై అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

పేదలకు ఇళ్ల పట్టాలిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దే

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి: పేదలకు ఇళ్లపట్టాలు అందజేస్తున్న ఘనత ముమ్మాటికీ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మున్సిపాలిటీలోని 16 వార్డు పరిధిలోని లబ్ధిదారులకు గురువారం ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే ఇంటి పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి నుంచి ఇళ్ల పట్టాల సమస్య అపరిష్కృతంగా ఉండగా, సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారన్నారు. బెల్లంపల్లి వ్యాప్తంగా 10వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధం పడిందన్నారు. లబ్ధిదారులు రాష్ట్రప్రభుత్వానికి బాసటగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, వార్డు కౌన్సిలర్ ఎలిగేటి సుజాత, 2వార్డు కౌన్సిలర్ అఫ్సర్, బీఆర్ఎస్ శ్రేణులు ఎలిగేటి శ్రీనివాస్, శ్రీధర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మహిళకు ఇంటి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే

బీఆర్ఎస్ పాలనలో పల్లెలు అభివృద్ధి

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్

జన్నారం: మండలంలోని చింతగూడ, చింతలపల్లి గ్రామాల్లో గురువారం గ్రామ పంచాయతీ భవనాలకు ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో పల్లెలు మురికికూపాలుగా మారితే, ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో పల్లెలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయన్నారు. పల్లెలు మరింత అభివృద్ధి జరగాలంటే, బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో రమేశ్, వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ రాజన్న, సర్పంచ్ అరే జ్యోతి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గంగాధర్, బీఆర్ఎస్ నాయకులు జనార్దన్, శ్రీనివాసరెడ్డి, బీవీఎస్‌నాయక్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.





దొనబండలో ర్యాలీ



మెమెంటో అందిస్తున్న ట్రైనీ కలెక్టర్ గౌతమి



ఆస్నాదలో ర్యాలీ



దేవాపూర్‌లో నిర్వహిస్తున్న ర్యాలీ



జన్నారం: కార్మికులను సన్మానిస్తున్న సర్పంచ్



తాండూర్‌లో...

ఊరూరా 'పల్లెప్రగతి' వేడుకలు

- గ్రామాల్లో ర్యాలీలు, సఫాయిలకు సన్మానం

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్ర అవతరణ, దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని మండలాలు, గ్రామాల్లో గురువారం పల్లె ప్రగతి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామసభలు నిర్వహించి ఊరూరా చేపట్టిన అభివృద్ధి పనులను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించారు. జన్నారం మండలం పొనకల్ గ్రామ పంచాయతీలో గ్రామసభను 8.50గంటలకు ముగించడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వేడుకల్లో భాగంగా గ్రామ పంచాయతీల వద్ద జాతీయ జెండా ఎగురవేశారు. ర్యాలీలు నిర్వహించారు. పంచాయతీ కార్మికులను, కార్యదర్శులను ప్రజాప్రతినిధులు సన్మానించారు. భీమిని మండలంలోని కేస్లాపూర్ నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ట్రైనీ కలెక్టర్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించి అనంతరం వేడుకల్లో పాల్గొని పంచాయతీ సిబ్బందిని సన్మానించి, మెమెంటో అందజేశారు. పలుచోట్ల మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. మందమర్రిలో డీఆర్‌డీవో శేషాద్రి, భీమినిలో డీఎల్‌పీవో ఫణీందర్‌రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు, సఫాయి కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.



మాలగురిజాలలో...



భీమారం: ధర్మారంలో ర్యాలీ



కోటపల్లి: వర్కర్స్‌ను సన్మానిస్తున్న సర్పంచ్



నెన్నెల: నందులపల్లిలో ర్యాలీ

మహిళలకు ముగ్గుల పోటీలు



చెన్నూర్‌లో...

మంచిర్యాలటౌన్/నస్పూర్/చెన్నూర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ, దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం మంచిర్యాల, నస్పూర్, చెన్నూర్ మున్సిపాలిటీల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, నస్పూర్ మున్సిపల్ కమిషనర్ రమేశ్, చెన్నూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్ గిల్డా, ప్రజాప్రతినిధులు ముగ్గులు పరిశీలించి, విజేతలకు బహుమతులు అందజేశారు. శుక్రవారం పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలన్నారు.